క్లుప్తంగా

నీట్‌లో విద్యార్థి సత్తా


నిశాల్ రెడ్డి

గుత్తి: గుత్తి పట్టణంలోని ఉపాధ్యాయ దంపతులు అరుణ కుమారి, రమేష్ రెడ్డి కుమారుడు లక్కిరెడ్డి నిశాల్‌రెడ్డి నీట్ పరీక్ష ఫలితాల్లో సత్తా చాటాడు. నీట్‌లో 539 మార్కులు సాధించి ఆల్ ఇండియాలో 17,965 ర్యాంకు కైవసం చేసుకున్నాడు. తల్లిదండ్రుల ప్రొత్సాహం వల్లే నీట్‌లో ర్యాంకు సాధించానని నిశాల్‌రెడ్డి తెలిపారు.

ప్రశాంత జీవనం అలవర్చుకోవాలి


మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ అషరఫ్ అలీ

గుంతకల్లు రూరల్: రౌడీషీటర్లు నేర ప్రవర్తనకు దూరంగా ఉంటూ ప్రశాంత జీవనం అలవరచుకోవాలని ట్రైనీ డీఎస్పీ అషరఫ్ అలీ సూచించారు. ఆదివారం ఆయన స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈసందర్భంగా సీఐ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గొడవలకు, అల్లర్లకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించి, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా విధించారు.

జీతం ఇవ్వండి సారూ..


వాచ్‌మన్ వెంకటరాముడు

గుత్తి: ఆరు మాసాలుగా జీతం ఇవ్వడం లేదు. వేతనం అందక కుటుంబం గడవటం కష్టమైందని.. వెంటనే జీతాలు ఇవ్వాలని గుత్తి వ్యవసాయ మార్కెట్ యార్డు వాచ్‌మన్ వెంకటరాముడు దీనంగా వేడుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. వెంకటరాముడు వ్యవసాయ మార్కెట్ యార్డులో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు.అయితే గత ఆరు మాసాలుగా జీతం ఇవ్వలేదు. ఎవరినీ అడిగినా పట్టించుకోలేదు. వెంటనే జీతాలు ఇవ్వాలని కోరుతున్నాడు.

ఆర్టీసీ బస్టాండ్ తనిఖీ


బస్టాండ్‌లో సదుపాయాలు కల్పించాలని చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రయాణికులు

గుత్తి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆదివారం ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన బస్టాండ్ అంతా కలియ తిరిగి సౌకర్యాలపై ఆరా తీశారు. బస్టాండ్‌లో ఎలాంటి సదుపాయాలు లేవని కొందరు ప్రయాణికులు చైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ


విజేతకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: ఆత్మరక్షణకు ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎస్‌ఎల్‌వీ థియేటర్ సమీపంలోని ఏఎస్ గోజు రియు కరాటే అకాడమీలో నిర్వహించిన కరాటే బెల్ట్ ఎగ్జామ్స్ ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కేబీ హాస్పటల్ వైద్యుడు మంజూర్ హాజరై విజేతలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్, సంఘ సేవకుడు మేస్త్రీ దొడ్డప్ప, మణికంఠ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు విశ్వనాథ్, కరాటే అకాడమీ ఆల్ ఇండియా చీఫ్ టెక్నికల్ డైరెక్టర్ ఎం.అల్తాఫ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఫాదర్స్‌డే రోజు.. అక్కాచెల్లెలు రక్తదానం


రెహమాన్ సమక్షంలో రక్తదానం చేస్తున్న కూతుర్లు రేష్మా, రోషిణి

గుంతకల్లుటౌన్: ఫాదర్స్‌డే రోజున ప్రతి ఒక్కరూ తమ తండ్రికి ఏదో ఓ కానుక బహూకరించి ఆనందపడతారు. ఈ కోవలోనే అక్కాచెల్లెలు టి.రేష్మా, టి.రోషిణి రక్తదానం చేసి ఫాదర్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయ పితృదినోత్సవం సందర్భంగా రెడ్‌డ్రాప్ రక్తదాతల సంస్థ వ్యవస్థాపకుడు రెహమాన్ కుమార్తెలిద్దరూ ఆదివారం కసాపురం రోడ్‌లోని ఓ ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేసి మానవత్వం చాటారు. రక్తదానం చేసిన కూతుళ్లను రెహమాన్, తోటి రక్తదాతలు అభినందించారు.

భయం.. భయం

- గాలికి ఊగుతున్న ఓవర్ హెడ్ ట్యాంక్
- ప్రమాదపుటంచుల్లో ప్రజలు
- పట్టించుకోని అధికారులు


వైటీచెరువు గ్రామంలో ట్యాంకు సమీపంలో ఉన్న ఇళ్లు


శిథిలావస్థకు చేరి గాలికి ఊగుతున్న ఓవర్‌హెడ్ ట్యాంకు

గుంతకల్లు రూరల్: ప్రజల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ ట్యాంక్ ఒక్క చుక్క నీటిని కూడా సరఫరా చేయకుండానే శిథిలావస్థకు చేరింది. ట్యాంకు నిర్వహణను పట్టించుకునే దిక్కులేకపోవడంతో.. క్రమంగా దెబ్బతిని నేడు ఎప్పుడు కూలిపోతుందో తెలియని దుస్థితికి చేరుకుంది. దాదాపు 20 అడుగుల ఎత్తుతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్ చిన్నపాటి గాలికి ఊగే స్థితికి చేరుకుందంటే పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉందో ఊహించడానికే భయమేస్తుంది. అలాంటి పరిస్థితిలో ట్యాంక్ సమీపంలో నివాసం ఉంటున్న దాదాపు 15 కుటుంబాలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని భయంతో బిక్కుబిక్కుమంటూ కాలాన్ని వెళ్లదీస్తున్నారు. మండలంలోని వైటీ చెరువు గ్రామానికి సత్యసాయి వాటర్‌ను అందించే క్రమంలో భాగంగా దాదాపు 20 సంవత్సరాల క్రితం ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించారు. కానీ ఎత్తైన ప్రాంతంలో ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మించడంతో.. ట్యాంక్‌లోకి నీరు చేరడం కష్టమైంది. దీంతో అప్పటి నుంచి ట్యాంకును అలాగే వదిలేశారు. నిర్వహణ లేమితో క్రమంగా ట్యాంకు దెబ్బతిని పెచ్చులూడుతోంది. అలాగే కొన్ని చోట్ల సిమెంట్ పూర్తిగా ఊడి కడ్డీలు మాత్రమే కనిపించే స్థితికి చేరుకుంది. అలాగే ట్యాంకు ఒకవైపు కాస్త వంగింది. దీంతో ప్రస్తుత వానాకాలంలో వీస్తున్న గాలులకు ఊగుతున్న ట్యాంకు ప్రమాద సంకేతాలతో గ్రామస్తులను హెచ్చరిస్తుంది.

ప్రమాదపుటంచుల్లో 15 కుటుంబాలు...

ఓవర్‌హెడ్ ట్యాంకుకు కింద భాగంలో దాదాపు 15 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ప్రమాదవశాత్తు ట్యాంకు కూలిపోతే ఆ ఇళ్లన్నీ దాదాపు నేలమట్టం కావాల్సిందే. ఈ కుటుంబాలు ఎక్కువశాతం కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. పిల్లలు, వృద్ధులను ఇంటి దగ్గర వదిలి పనులకు వెళ్లి సాయంత్రానికి తిరిగి వచ్చేవారు కావడంతో ఏ సమయంలో ఏం జరుగుతుందో తెలియడం లేదని, పొలాల్లో పనులు చేస్తున్నా భయం మాత్రం వీడటం లేదని వారు వాపోతున్నారు. సమస్యను పరిష్కరించమని ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో భయంతో బిక్కుబిక్కుమంటున్నారు.

పొలంలో పనిచేస్తున్నా అదే ధ్యాస



నాకు ఐదుగురు కొడుకులు, ఐదుగురు కోడళ్లు ఉన్నారు. పిల్లలతో కలసి ఇంట్లో ఏకంగా 15 మంది దాకా ఉంటున్నాం. ట్యాంకు కిందనే మా ఇళ్లు ఉంది. ఇన్నాళ్లు పెచ్చులూడుతూ వచ్చిన ట్యాంక్ ఇప్పుడు గాలికి ఊగుతుంది. దీంతో ఏ సమయంలో ఏం జరుగుతుందోనని భయంతో చచ్చిపోతున్నాం. పొలంలో పనిచేస్తున్నా ఇంటి దగ్గర పిల్లలు ఎలా ఉన్నారోనన్న భయం వెంటాడుతుంటుంది.

– లక్ష్మీదేవి, వైటీ చెరువు

వెన్నులో వణుకు పుడుతుంది..



కొద్ది రోజులుగా గాలికి ట్యాంకు ఊగుతోంది. ఆ దృశ్యం చూస్తుంటే వెన్నులో వణుకు పుడుతుంది. జరగరానిది ఏదైనా జరిగితే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించడానికి భయమేస్తుంది. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే చొరవ తీసుకొని ట్యాంకుకు మరమ్మత్తులు చేపట్టడమో, లేదా కూలగొట్టడమో చేస్తే బాగుంటుంది. లేదంటే ట్యాంకు ఎప్పుడైనా కూలే ప్రమాదం ఉంది.

– పెద్దన్న, వైటీ చెరువు

రాత్రి పూట నిద్రపట్టడం లేదు..



గాలికి ఊగుతున్న ట్యాంకునే చూస్తుంటే ఏ సమయంలో ఇంటిపై పడుతుందో అనే భయం అనుక్షణం వెంటాడుతోంది. కూలి పనులకు వెళ్లి రోజంతా పొలంలో కష్టం చేసి వచ్చిన మాకు రాత్రి కంటి మీద కునుకు లేదు. ఏ సమయంలో ఏమి జరుగుతుందో అనే భయంతో నిద్రకూడా పట్టడం లేదు. దయచేసి ట్యాంకును తొలగించి, ఈ ప్రమాదం నుంచి మమ్మల్ని గట్టెకించండి.

– ఓబులేసు, వైటీ చెరువు

తహసీల్దార్ కార్యాలయంలో బదిలీలు

శింగనమల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలువురు అధికారులు బదిలీ అయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తహసీల్దార్‌గా బ్రహ్మయ్య బాధ్యతలు తీసుకున్నారు. సంవత్సరం అయిన వెంటనే ఆయనను కణేకల్లు మండలానికి బదిలీ చేశారు. కూటమి నేతలు ఒత్తిడితో బదిలీ జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. శింగనమలకు పుట్లూరు తహసీల్దార్ శేషారెడ్డిని నియమించారు. కానీ ఈయనను మొదట బుక్కరాయసముద్రం తహసీల్దార్‌గా బదిలీ చేశారు. అక్కడి కూటమి ప్రభుత్వంలోని ఒక వర్గం విభేదించడంతో, అక్కడే పని చేస్తున్న తహసీల్దార్‌ను అలాగే ఉంచి, శేషారెడ్డిని శింగనమలకు బదిలీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న ప్రకాష్‌రావును నార్పలకు బదిలీ చేశారు. ఇక్కడికి కూడేరులో పని చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్‌ను బదిలీ చేశారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ పునీత్ బాబును అనంతపురం రూరల్‌కు, బుక్కరాయసముద్రంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నారాయణస్వామిని బదిలీ చేశారు. ఆయన గతంలో శింగనమలలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. శింగనమలలో వీర్వోగా , సీనియర్ అసిస్టెంట్‌గా ఎన్నో సంవత్సరాలు పని చేసిన వెంకటరామిరెడ్డిని అనంతపురం ఆర్‌ఐగా బదిలీ చేశారు. ఇక్కడికి సీనియర్ అసిస్టెంట్‌గా ఆత్మకూరు మండలం నుంచి నాగభూషణంను బదిలీ చేశారు. ఆర్‌ఐగా పని చేస్తున్న నవీన్‌కుమార్‌ను గుంతకల్లుకు, శింగనమలకు బసిరున్నిసాను బుక్కరాయసముద్రం మండలం నుంచి బదిలీ చేశారు. ఏఎస్‌ఓగా పని చేస్తున్న నాగలక్ష్మిని బుక్కరాయసముద్రానికి, గుంతకల్లు ఏఎస్‌ఓ సుభాషిణిని శింగనమలకు బదిలీ చేశారు. సర్వేయర్ చైన్‌మన్‌గా శింగనమలకు తాడిపత్రి నుంచి నారాయణరెడ్డిని బదిలీ చేశారు. ఆఫీస్ సబార్డినేట్‌గా సాదిక్‌ను అనంతపురం నుంచి శింగనమలకు బదిలీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఇంత మంది బదిలీ కావడంతో రాజకీయ ఒత్తిడులు ఉన్నట్లు మండలంలో చర్చించుకుంటున్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?


గుంతలమయమైన చెరువు కట్ట రోడ్డు

బుక్కరాయసముద్రం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినా రోడ్లను బాగుచేసేవారు కరువయ్యారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు ఇలా.. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న చెరువు కట్టపై ఉన్న రోడ్డు గుంతలుగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం నుంచి బీకేఎస్‌కు కలెక్టరేట్ మీదుగా వచ్చే రహదారి పూర్తిగా గుంతలమయమైంది. ఇదే రహదారిపై రోజూ ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు ప్రయాణిస్తున్నా పట్టించుకోవడం లేదు. చిన్నపాటి వర్షాలకే మురుగు నీటితో గుంతలు నిండి వాహనదారులకు నరకయాతనగా మారుతోంది. కనీసం గుంతలు కూడా పూడ్చలేకపోవడం దారుణమని వాహనదారులు మండిపడుతున్నారు. కలెక్టర్ అయినా స్పందించి చెరువుకట్ట రోడ్డు బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

క్షుద్రపూజల కలకలం


ఇంటి ఎదుట క్షుద్రపూజలు చేసిన దృశ్యం

గుంతకల్లు: పట్టణంలోని 60వ అడుగుల రోడ్డులో నివాసముంటున్న మాజీ కౌన్సిలర్ రామచంద్ర ఇంటి ఎదుట క్షుద్ర పూజల ఘటన కలకలం రేపింది. బాధితుడి వివరాల మేరకు.. ఆదివారం ఉదయాన్నే 5.30 గంటలకు ఆయన నిద్ర లేచి ఇంటి బయట చూడగా ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యాడు. ముగ్గులు వేసి పసుపు, కుంకుమ చల్లడంతోపాటు టెంకాయి, తయారు చేసిన బొమ్మ చేతులతోపాటు చెప్పులు వేసి పూజలు చేసినట్లు గుర్తించాడు. తాను గత కొంత కాలంగా పట్టణంలోని బళ్లారి చౌరస్తాలోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన ఓ వ్యక్తిపై పోరాటాలు చేస్తున్నానన్నాడు. దీంతో ఇంటి సమీపంలోని తనకు గిట్టని కొందరి సాయం తీసుకుని ఈ పనికి ఒడిగట్టినట్లు ఆయన ఆరోపించాడు. ఈ విషయమై టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నాడు.

హంద్రీ-నీవా కాలువలోకి టిప్పర్ బోల్తా


కాలువలోకి పడిన టిప్పర్

గుంతకల్లు రూరల్: మండలంలోని కసాపురం గ్రామ సమీపంలో ఉన్న హంద్రీ-నీవా కాలువలోకి ఆదివారం టిప్పర్ బోల్తాపడింది. హంద్రీ-నీవా కాలువ విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో కాలువ మట్టిని తరలిస్తున్న టిప్పర్ కాలువ పక్కన ప్రయాణిస్తూ.. అదుపుతప్పి కాలువలోకి బోల్తా పడింది. టిప్పర్‌లో ఉన్న డ్రైవర్, క్లీనర్ ప్రమాదం నుంచి సురక్షితరంగా బయటపడ్డారు.

నేడు 'వెన్నుపోటు' పుస్తకావిష్కరణ

గుంతకల్లుటౌన్: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనా వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ ప్రచురించిన 'జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు ఖలీల్, రాము తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఈ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆదివారం వారు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

శింగనమల: మండల కేంద్రంలోని రామాలయం గుడి దగ్గర సోమవారం 'జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం' పుస్కకావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సమన్వయకర్త శైలజానాథ్ హాజరవుతారన్నారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు.

ప్రధాని మోదీతోనే దేశ భవిష్యత్తు


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్

తాడిపత్రి రూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో దేశ భవిష్యత్తు ఆధారపడిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ అన్నారు. పట్టణంలోని ఏపీఆర్ ప్యారడైజ్‌లో ఆదివారం జరిగిన మేధావుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ 11ఏళ్ల పదవీ కాలంలో సుపరిపాలన జరిగిందన్నారు. రైతు సంక్షేమం- దేశ సంక్షేమంగా పాలన కొనసాగుతోందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారన్నారు. వైఎస్సార్ జిల్లా ఇన్‌చార్జ్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రధాని కేంద్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించారన్నారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ అంకాల్‌రెడ్డి, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, వాసవీమండలి సభ్యురాలు నాగరాగిణి, జిల్లా గ్రంథాలయ కన్వీనర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన


కంటిపరీక్షలు చేస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని భావసార క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం పామిడి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి ఎన్. తిరుపతినాయుడు సారథ్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శిబిరంలో బెంగళూరుకు చెందిన శంకర ఆస్పత్రి కంటి వైద్య నిపుణురాలు క్రతిక గుప్తా 280 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 117 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆ క్లబ్ అధ్యక్షుడు రఘువీర్, ఉపాధ్యక్షుడు పత్రా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి పీసే జయరాం, కోశాధికారి షెక్షావలి, జిల్లా చైర్‌పర్సన్ డాక్టర్ మురళీకృష్ణ, మెంబర్‌షిప్ చైర్‌పర్సన్ డాక్టర్ శాంతిప్రియ, సంయుక్త కార్యదర్శి రోషన్ జమీర్, డైరెక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాకవి శ్రీశ్రీకి నివాళి


శ్రీశ్రీ వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ప్రజాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు స్వర్ణాంబ, అదనపు కార్యదర్శి కుళ్లాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ డీఈ బదిలీ

తాడిపత్రి రూరల్: తాడిపత్రి ఆర్‌అండ్‌బీ డీఈ సురేష్ నాయక్ తిరుపతి జిల్లా పీలేరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అన్నమయ్య జిల్లా రాజంపేటలో పని చేస్తున్న మధుసూదన్ తాడిపత్రికి బదిలీ అయ్యారు. స్థానిక కార్యాలయంలో బదిలీపై వెళుతున్న సురేష్‌నాయక్‌కు ఆదివారం సిబ్బంది వీడ్కోలు పలికారు.

త్వరలో శ్మశాన వాటిక పునరుద్ధరణ పనులు

తాడిపత్రి రూరల్: త్వరలో శ్మశాన పునర్ధురణ పనులు చేపడతామని మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని హిందూ శ్మశాన వాటికలో అర్చకులతో కలిసి ఆయన ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందరి ఆమోదంతో పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామన్నారు. వివిధ దేవాలయాలకు చెందిన అర్చకులతో మాట్లాడి వారి సూచనలు, సలహాల మేరకు కార్యక్రమాలు చేపడతామన్నారు.

'సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి'

గుంతకల్లుటౌన్: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని బీజేపీ అనంతపురం పార్లమెంట్ మాజీ కన్వీనర్ చిరంజీవిరెడ్డి తెలిపారు. ఆదివారం ఇల్లూరు లక్ష్మీనారాయణ భవన్‌లో వికసిత్ భారత్ సంకల్ప సభను నిర్వహించారు. కార్యక్రమంలో వికసిత్ భారత్ సభ గుంతకల్లు ఇన్‌చార్జ్ గంగరాజు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు వడ్డే రమేష్, వాసం రవి, నాయకులు శేఖన్న, హరిహరనాథ్, పురంధర్, కొలిమి రామాంజి, శ్రీదేవి, అశోక్, రాఘవ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'బయోమెట్రిక్ తప్పనిసరి'

పెద్దవడుగూరు: అన్నదాత సుఖీభవ పథకం మంజూరుకు అర్హతలు ఉన్న రైతులు బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలని ఏఈఓ సునీత ఆదివారం సూచించారు. మండలంలోని రైతు సేవా కేంద్రాలల్లో అర్హుల జాబితాను అతికిస్తామన్నారు. అందులో పేర్లు ఉన్న వారు తప్పనిసరిగా సోమవారం రైతు సేవా కేంద్రానికి వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ-కేవైసీ చేయించుకోని వారి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ కావన్నారు. ఈ విషయాన్ని అన్నదాతలు గమనించాలన్నారు.

20 నుంచి కౌన్సెలింగ్

గుంతకల్లుటౌన్: పాలిటెక్నిక్-2025లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 20 నుంచి 27 వరకు ప్రాసెసింగ్ ఫీజును ఆన్‌లైన్ చెల్లించి హెల్ప్‌లైన్ కేంద్రాల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలని గుంతకల్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ పిఎస్.వెంకట రమణారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 21 నుంచి 28 వరకూ జరిగే వెరిఫికేషన్‌కు హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, ఎస్ఎస్‌సీ మార్క్ మెమో, స్టడీ సర్టిఫికెట్లు, ఆదాయం, కుల, నివాస ధ్రువీకరణ పత్రాల (ఒరిజినల్, రెండు సెట్ల జిరాక్స్)తో హాజరు కావాలన్నారు. 25 నుంచి 30 తేదీ వరకు వెబ్‌ఆప్షన్స్ నమోదు, జూలై 1న మార్పులు, 3న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలోనే ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, వెబ్ ఆప్షన్స్ నమోదు చేయించుకోవచ్చని విజ్ఞప్తి చేశారు. వివరాలకు 7075932669 నంబర్‌లో సంప్రదించాలన్నారు. కర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు.

నారాయణుడికి ప్రత్యేక పూజలు


శింగరబట్టు, గణపతి, నారాయణస్వామి

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వత్థంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శింగరబట్టు, గణపతి, నారాయణ స్వామి, శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి, శ్రీ చక్ర భీమలింగేశ్వరులను దర్శించుకున్నారు. కోర్కెలు నెరవేరిన భక్తులు ముడుపులతో పాటు తలనీలాలు సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు.

ఇగుడూరు గంగమ్మకు పూజలు

తాడిపత్రిటౌన్: మండలంలోని ఇగుడూరు గంగమ్మ అమ్మవారికి ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలహారాలు, పసుపు కుంకుమలతో ప్రత్యేకంగా అలకరించి అర్చనలు, అభిషేకాలు చేశారు. తాడిపత్రికి చెందిన పలువురు రాజకీయనాయకులు, విద్యా, వ్యాపార వేత్తలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

'కోటంక'లో అభిషేకం

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు అభిషేకం, కుంకు మార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకార్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అమ్మవారి శాలల్లో పూజలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట సమీపంలో వెలసిన ముసలమ్మ తల్లి దేవాలయం, పెద్దమ్మ తల్లి ఆలయంలో వెలసిన అమ్మవార్లకు ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయంలో దీపాలు పెట్టి అర్చనలు అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

సర్టిఫికెట్లు ఇప్పించాలి

చెన్నేకొత్తపల్లి: విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్లను తమ తల్లిదండ్రుల నుంచి ఇప్పించాలని అఖిల, నరేంద్ర దంపతులు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. వివరాలు.. గుత్తికి చెందిన అఖిల, చెన్నేకొత్తపల్లి మండలానికి చెందిన నరేంద్ర పుట్టుకతోనే మూగ, చెవిటి వారు. వీరు ఆర్డీటీ సహకారంతో బుక్కరాయసముద్రంలో ఇంటర్మీడియట్ వరకూ చదువుకున్నారు. ప్రేమ వివాహం అనంతరం ఇద్దరూ బెంగళూరులో ప్రైవేట్ జాబ్ చేసుకుంటున్నారు. అఖిల కులాంతర వివాహం చేసుకుందనే కారణంలో బంధువులు ఇద్దరి విద్యార్హత సర్టిఫికెట్లను తీసుకెళ్లారు. అధికారులు స్పందించి సర్టిఫికెట్లు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని అఖిల, నరేంద్ర దంపతులు కోరుతున్నారు.

ఇంటిపై నుంచి కింద పడి పెయింటర్ మృతి

పామిడి: ఇంటి పైభాగంలో పెయింటింగ్ చేస్తూ ఓ వ్యక్తి కిందపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పామిడిలోని వెంగమనాయుడు కాలనీలో నివాసముంటున్న మస్తాన్‌వలి (50)కు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెయింటింగ్ పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో గ్రామంలోని మంజు టాకీస్ ప్రాంతంలో ఓ ఇంటికి పెయింటింగ్ పని ఒప్పుకున్న ఆయన ఆదివారం పనిలో నిమగ్నమయ్యాడు. ఇంటి పైభాగంలో పెయింట్ వేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.